## నేడు సంగెంలో ఎమ్మెల్యే చల్లా ప్రచారం

సంగెం, నవంబర్ 9 : మండలంలో శుక్రవారం పరకాల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి తెలిపారు. ఉదయం 6 గంటలకు నల్లబెల్లి బాలు నాయక్‌తండా, 7 గంటలకు నార్లవాయి, 8గంటలకు ఎల్గూర్‌స్టేషన్, సాయంత్రం 5 గంటలకు ఎల్గూర్ రంగంపేట, 6 గంటలకు మొండ్రాయి, గొల్లపల్లి, ముమ్మిడివరం, 7 గంటలకు పల్లార్‌గూడ వీఆర్ఎన్ తండా, పోచమ్మతండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఉంటుందని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

## ఎమ్మెల్యే చల్లాకే ప్రజల మద్దతు

నడికూడ, నవంబర్ 9 : పరకాల బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డికి మద్దతు తెలుపుతూ మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన నామినేషన్ కోసం పరకాల ఆర్డీవో కార్యాలయానికి గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి విజయం సాధించడానికి ఎమ్మెల్యే చల్లా సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే చల్లా తన నియోజకవర్గంలో వంద శాతం అమలు చేశారన్నారు. అందుకే ప్రతి గ్రామంల్లో ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎలుకుర్తిలో పత్తి పంటను పరిశీలిస్తున్న నాగభూషణ్

## అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు ఎంతో లాభదాయకం

గీసుగొండ, నవంబర్ 9 : అధిక సాంద్రత విధానంలో పత్తి పంట సాగు లాభదాయకమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, వరంగల్ ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నాగభూషణ్ అన్నారు. మండలంలోని ఎలుకుర్తి గ్రామంలో అధిక సాంద్రత విధానంలో సాగు చేస్తున్న పత్తిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగభూషణ్ మాట్లాడుతూ అధిక సాంద్రత విధానంలో పత్తి పంటను సాగు చేయడం వల్ల కూలీల ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల్లో చైతన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజన్న, మేనేజర్ మనోజ్, రాజు, రైతులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేస్తున్న పంచాయతీ సిబ్బంది

దామెర, నవంబర్ 9 : మండల కేంద్రంలో అనుమతి లేకుండా నిర్మించిన ఇంటిని అధికారులు గురువారం కూల్చివేశారు. పంచాయతీ కార్యదర్శి నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోలసాని విమల ఎలాంటి అనుమతి తీసుకోకుండా విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఇంటిని నిర్మించారు. పంచాయతీ కార్యాలయం నుంచి నోటీసులు పంపినా స్పందించలేదు. దీంతో పంచాయతీ అధికారి రంగాచారి ఆదేశం మేరకు ఇంటి నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కారోబార్ బొబ్బిలి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పరకాల : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



నడికూడ : కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

# అన్ని వర్గాల మద్దతు బీఆర్ఎస్‌కే

- రానున్నది కేసీఆర్ ప్రభుత్వమే
- విపక్షాలపై ఆ పార్టీల కార్యకర్తలకే నమ్మకం లేదు
- అందుకే బీఆర్ఎస్‌లో చేరుతున్నరు
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- పార్టీలో కాంగ్రెస్ నాయకుల చేరిక

పరకాల, నవంబర్ 9 : రాష్ట్రంలో అన్ని వర్గాల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందని, మళ్లీ అధికారంలోకి రానున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని హైబోత్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యమనాయకుడిగా, తెలంగాణ ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. దీంతో రాష్ట్రంలోని అన్ని వర్గాల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ లాంటిదన్నారు. ఆ పార్టీపై కాంగ్రెస్ నాయకులకే విశ్వాసం లేదన్నారు. అందుకే కాంగ్రెస్ శ్రేణులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని, కాంగ్రెస్‌లో చివరకు ఆ పార్టీ అభ్యర్థి కూడా మిగలడని ఎద్దేవా చేశారు. కాగా, పార్టీలో చేరిన వారిలో గౌడ రాజయ్య, ఎండీ రజాక్, కంచ ఎల్లయ్య, కంచ చేరాలు, కంచ అయిలయ్య, ఎండీ బాషుమియా, ఎండీ రాజ్ మహ్మద్, కేతిరి సాంబయ్య, కేతిరి చంద్రయ్య, మహ్మద్ అబ్దుల్, ఎండీ యాకూబ్, నీల అశోక్, కుమ్మరి రాజేశ్, మధుకర్, రాకేశ్, కోలు నాగరాజు, గొట్టి వివేకంద ఉన్నారు.

**సీఎం కేసీఆర్ సభా స్థలి పరిశీలన**

పట్టణంలో ఈ నెల 17న జరుగనున్న సీఎం కేసీఆర్ సభ కోసం స్థలాన్ని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరిశీలించారు. పట్టణంలోని వెల్లంపల్లి రోడ్డులో ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు ఎమ్మెల్యే పలు సూచనలు ఇచ్చారు. సీఎం సభను విజయవంతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, సోదా రామకృష్ణ, రేగూరి విజయపాల్ రెడ్డి, బిల్లా రమణారెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి, బండి సారంగపాణి, దామెర మొగిలి, మడికొండ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**జోరుగా బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు**

నడికూడ : మండలంలోని చర్లపల్లి గ్రామంలోని కాంగ్రెస్ యూత్ నాయకులు గురువారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాకముందు, ఇప్పుడు అభివృద్ధిలో మార్పును యువత గమనించాలన్నారు. భవిష్యత్ బాగుండాలంటే మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి రావాలన్నారు. అందుకు యువత బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రలోభాలకు లొంగవద్దన్నారు. పార్టీ లో చేరిన వారిలో గుడికందుల స్వామి, నడికొండ రాజు, ఎండీ జాకీర్, పున్నం సాయి చరణ్, బసువారి రాజు, ఎదులాపురం వెంకటాచారి, వీర ప్రతాప్, బసువారి రవి, బసువారి రాజేంద్రప్రసాద్, బసువారి మధువాన్, కుసుంబ హరీశ్, జక్కుల రాజ్‌కుమార్, బసువారి హరీశ్, గుమ్మడి రంజిత్ కుమార్, బూర రాజు, అప్పుల వంశీ ఉన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రైతులకు కష్టాలే



ల్యాదెళ్లలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ కాగితాల శంకర్, నాయకులు

దామెర, నవంబర్ 9 : రైతులకు మూడుగంటలు కరెంటు చాలంటున్న కాంగ్రెస్‌కు ఓటు వేస్తే పంటలు ఎండిపోయి రైతులు కష్టాలపాలవుతారని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. గురువారం మండలంలోని ల్యాదెళ్ల, సింగరాజుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని, కారుగుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు, మహిళా కమ్యూనిటీ భవనాలు, అర్హులైనవారందరికీ ఆసరా పింఛన్లు ఇచ్చిన ఘనత ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికే దక్కిందన్నారు. రైతులకు 24గంట కరెంటు, ఇంటింటికీ తాగునీరు ఇస్తున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గ్రామాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేశారన్నారు. ఎప్పుడూ లేనంతగా పంటలు పండుతుండడంతో రైతన్నలు ఆనందంగా ఉన్నారన్నారు. గ్రామాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కారు గుర్తుకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుతో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దాడి మల్లయ్య, మేరుగు కుమార్, చింతం రాజేశ్, దైనంపల్లి రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళల్లో సాధన చేస్తే మరింత రాణించవచ్చు : డీఈవో

హనుమకొండ సిటీ, నవంబర్ 9 : విద్యార్థులు తమకు ఇష్టమైన కళల్లో సాధన చేస్తే మరింత రాణించవచ్చని డీఈవో డాక్టర్ అబ్దుల్ హై సూచించారు. 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు రెండు రోజుల కళోత్సవ్ పోటీలను గురువారం లష్కర్‌బజార్‌లోని ప్రాక్టిసింగ్ ప్రైమరీ పాఠశాలలో డీఈవో ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు ఇష్టమైన కళలపైన విద్యార్థులు దృష్టిసారించాలన్నారు. న్యాయనిర్ణేతలు ఎలాంటి పక్షపాతం లేకుండా విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయాలన్నారు. గురువారం 7 అంశాల్లో పోటీలు నిర్వహించగా 64 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి విభాగానికి ఇద్దరు చొప్పున 14 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. శుక్రవారం క్లాసికల్, ఫోక్ డ్యాన్స్, దేశీయ ఆటలు, బొమ్మల పోటీలను నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఉప్పలయ్య, జగన్, సోషల్ ఫోరం బాధ్యులు సతీశ్‌ప్రకాశ్, మధుసూదన్ రెడ్డి, రాధాకృష్ణాచారి, అశోక్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చటగా మూడోసారీ కేసీఆరే సీఎం

- బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్సీలు మోహన్ రెడ్డి, పూల రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీలు మోహన్‌రెడ్డి, పూల రవీందర్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 9 : దేశంలోనే ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి మళ్లీ సీఎం అవుతారని మాజీ ఎమ్మెల్సీలు బీ మోహన్‌రెడ్డి, పూల రవీందర్ అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ప్రజలు మళ్లీ సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. పదేళ్ల క్రితం రాష్ట్రం ఎలా ఉందో, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గమనించాలని సూచించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపాలని కోరారు. తెలంగాణ వచ్చిన తర్వాత విద్యారంగం చాలా అభివృద్ధి చెందిందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. చిన్న రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఉంటేనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మళ్లీ బీఆర్ఎస్‌ను అధికారంలోకి తెచ్చుకుని మంచి ఫిట్‌మెంట్‌తో వేతనాలు సాధిద్దామని తెలిపారు. పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వంతో చర్చించినట్లు తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందన్నారు. సమావేశంలో పీఆర్టీయూ అసోసియేట్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీరమల్ల నర్సింగరావు, బాల్ని రామయ్య, సదాశివుడు పాల్గొన్నారు.